# ఉమ్మడి బ్రతుకులు

రచన:
శ్రీ తమ్మిశెట్టి రామారావు.

తెల్లార్లు తెల్లవారి బారెడు పొద్దెక్కింది. మంచినీళ్ళు పుక్కిలించి వూసి, తూర్పుకేసి తిరిగి రెండు చేతులెత్తి దణ్ణం పెట్టింది మారమ్మ. "ఓ వుదయలచ్చల తండ్రీ! యియ్యాలైనా ఓ వుత్తరం ముక్కొచ్చేలా దయ చూడయ్యా!" అని భర్త చనిపోయిన కాడనుంచి సూర్యుడి దణ్ణం పెట్టడం అలవాటు.

మారమ్మకి యిద్దరు కొడుకులు. పెద్దవాడు వెంకటేశానికి ముగ్గురాడపిల్లలు, ఒక మగపిల్లడు మద్రాసులో ఒక ఫౌండ్రీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. చిన్నవాడు సూర్యానికి ఒక మగబిడ్డడు. మధ్య ప్రదేశ్‌లో ఒక చిట్ ఫండ్ కంపెనీలో టైపిస్ట్‌గా పని చేస్తున్నాడు. సూర్యం ఉద్యోగ రీత్యా మధ్య ప్రదేశ్ వెళ్ళిపోయిన తర్వాత మారమ్మ వెంకటేశం కాడకి చేరింది. ఏణ్ణర్థం గడచేసరికి మారమ్మ మొహం మొత్తింది. అదిగాక వెంకటేశం చాలీ చాలని బత్తెంతో సతమతమౌతూ, పిల్లల్తో నానా బాధా పడుతున్నాడాయె.

"బాబు! వెంకటేశం ఎన్నాళ్ళనిరా! వున్న వూరు ఇల్లు వదిలేసి వుండడం. పోనీ సూర్యానికి ఆ మూడు ముళ్ళు పడిపోతే కొన్నాళ్ళు వాడి పంచనవుంటే నాదినం అలా తీరిపోతుంది." అంది మారమ్మ.

"ఓ అలాగేనమ్మా: తమ్ముడికి వుత్తరంరాసి చూస్తాను. ఏమంటాడో" అన్నాడు వేంకటేశం.

ఆరుమాసాలు గడవకముందే సూర్యానికి మంచి సంబంధం కుదరడం, మారమ్మ కొడుకుతో మధ్యప్రదేశ్ వెళ్ళిపోవడం జరిగింది. కాని మారమ్మకి చిన్న కోడలి మనస్తత్వం నచ్చలేదు. చిన్నకోడలు నాగమణికూడ అత్తని చూసి అసహ్యించుకునేది.

అత్తా కోడళ్ళమధ్య చిరుబొరుకులు పట్టించుకొనే వాడు కాదు సూర్యం. మారమ్మ కొడుకుతో చెప్పి మళ్ళ వున్నవూరు ప్రయాణం కట్టింది.

తల్లిని రైలెక్కిస్తూ ఎలాఎలా బళ్ళుమారాలో వివరించాడు సూర్యం. నేనంత తెలివితక్కువ దాన్నంట్రా సూర్యం" అంది మారమ్మ.

"నే నొక్కణ్ణి నెలనెలా పాతిక రూపాయలు పంపిస్తానమ్మా! అక్కడేవుండు. అన్నయ్యకి కూడా వుత్తరం రాయించు వాడూ పదో పరకో పంపక పోడు. నీవు నిశ్చింతగా స్వంత ఇల్లు కనిపెట్టుకుని వుండువుగాని. అదే నీకునచ్చుతుంది." అన్నాడు సూర్యం.

పెద్దవాడు మొదట్లో పదో పరకో పంపినా, రాను రాను మానుకున్నాడు. చిన్నవాడు ఎలాగూ పంపుతునే వున్నాడు. పెద్దవాడంటే మారమ్మకి ప్రాణం. పోనీలే పిల్లల్తోనూ, పెళ్ళాంతోనూ వాడు చల్లగావుంటే అదే చాలనుకుంది మారమ్మ. కూలో నాలో ఎలాగూ తనకు తప్పలేదు.

మారమ్మకి వయసు పెరుగుతోంది, అలాగే చిన్నవాడి చదువూ, సంధ్యకోసం చేసిన అప్పూ పెరుగుతోంది. ఇంటిమీద అప్పు గురించి ఒకటీ రెండుసార్లు సూర్యానికి రాసింది. కాని సూర్యం ఆమాట పట్టించుకోలేదు పెద్దవాడికి ఎలారాయాలని వూరుకుంది.

ఇప్పుడు అది పీకల మీది కొచ్చింది. అప్పిచ్చిన శరభయ్య కోర్టులో డిక్రీపొందాడు. రెండ్రోజులనుండి ఇల్లు ఖాళీ చేసి పొమ్మని వీధిపెడుతున్నాడు.

మధ్యాహ్నమైంది వుత్తరం కోసం ఎదురుచూస్తోంది మారమ్మ ఇక్కడి పరిస్థితంతా యిద్దరికొడుకులికి రాసింది. ఇద్దరిలో ఎవరొకరు చేరదీస్తే వచ్చేస్తానంది. కాని ఏ ఒక్కరి కాడనుండి ఇంతవరకూ జవాబు కనపడలేదు.

"యియ్యాలైనా వుత్తరం రాకపోద్దా" అని మనస్సులో అనుకొని పోస్టుమేన్ కోసం ఎదురు చూస్తోంది మారమ్మ.

---

వధూవరు లిద్దరూ, బలరాంగారి దగ్గరకు వచ్చారు దీవించమని. ఆనందంతో ఆనందబాష్పాలు రాల్చి, అక్షింతలుజల్లి అలాగే నేలకు ఒరిగి పోయారు బలరాం గారు. అంతే అప్పుడే ఆయన ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది.

అది చూసి నింగిలో నిశాకరుడూ నవ్వుకున్నాడు నిండుగా.

అంతలో పోస్టుమేన్ రాజు సైకిల్ బెల్లు మోగించుకొంటూ మారమ్మ కాడకి వచ్చాడు. మారమ్మ మొఖం చేటంత అయింది.

"ఒత్తరమేనా బాబు! మనాడ్రేమైనా వచ్చిందా?" అంది. "ఓ! మని యార్డరుకూడావుంది" అన్నాడు పోస్ట్ మేన్.

మనియార్డరు ఎక్కణ్ణించి వచ్చిందో మారమ్మకి తెల్సు. అందుకు "వుత్తరం ఎక్కణ్ణించి నాయనా? కొంచెం చదివియిద్దూ" అంది వుత్తరం కోసిచూసి 'మద్రాసు' అన్నాడు.

"ముందు సంతకం పెట్టు డబ్బు తీసుకొందువుగాని" అన్నాడు పోస్టుమేన్. ఇప్పటికి మారమ్మ ఎన్నోమనియార్డరు ఫారాలమీద ఒణుకుతూ సంతకంచేసింది. కాని కాస్తచూపు మందగించడం చేత వుత్తరాలు మాత్రం పోస్టుమేన్ చేత చదివించుకుంటాది.

సంతకం కానిచ్చి డబ్బుతీసుకొంది మారమ్మ. అన్నీ ఇచ్చురూపాయలే పాతిక యిచ్చాడు పోస్టుమేన్. ఆన వాయితగా పావలా మార్చియిచ్చింది మారమ్మ.

మనియార్డరు ఫారం ముక్కతోపాటు వుత్తరం ముక్క యిచ్చాడు పోస్టుమేన్ మారమ్మ చదివిపెట్టమంది. అందులో వుత్తరం యిలావుంది.

అమ్మకి--

నీవు రాసిన కార్డు అందినది. అందలి సంగతులు తెలిసినవి. ఇల్లు పోతున్నందుకు నీవేమీ బాధపడవద్దు. ఈ పరిస్థితుల్లో నేనేమీ చేయలేను. ఈవిషయం గురించి తమ్ముడికిరాశాను కిమ్మనలేదు. నాపరిస్థితికి నీకు తెలియందికాదు. ఇప్పుడు నీ కోడలికి సుస్తీగావుంది నానా యాతనా పడుతున్నాను. నాకాడకి వచ్చినా నీకు సుఖంవుండదు. అందుకే సూర్యానికి వుత్తరం రాస్తున్నాను. నిన్నువచ్చి తీసుకెళ్ళమని. ఆపని చెయ్యి ఇంతే సంగతులు,

నీకుమార్డు
వెంకటేశం.

ఆవుత్తరం విని మారమ్మ కొంచెం తమాయించుకొంది. "ఇంక చిన్నవాడు ఆకాస్త ముక్కలో ఏం రాశాడు చదువు నాయనా" అంది. అక్షరాలు మరీ చిన్న


బనియన్ల తయారింపులో
మా ప్రత్యేక తయారింపులు
★ గాయత్రి ఫైన్ _ సరైన కొలత
★ విస్‌పా ఫైన్ _ సరైన కొలత
★ T.N.H స్పెషల్ _ సరైన కొలత
★ హాంక్ కాంగ్ _ (రీసైజు)
★ నైలాన్ బనియన్లు (రీసైజు)
T.N.H TRADE MARK
తయారించువారు:
ది నంజప్పా హొజయిసరీస్ తిరుపూరు_2


వగుటచేత కళ్ళు చిట్లించి చదివాడు. అందులో యిలా వుంది.

అమ్మకి నమస్కారములు.

నీ వుత్తరం అందింది. ఇల్లేకదా పోతేపోతుంది. దాని గురించి నన్నింత రాద్ధాంతంచేయాలా! ఇన్నాళ్ళూ అన్నయ్య చూడకపోయినా నేను చూస్తూ వచ్చాను. నీగురించి నీకోడలూ - నేనూ పేచీలు పడుతున్నాము. ఇకనుంచి ఆపాతిక రూపాయలుకూడా పంపలేను. ఈ సారికి పంపుతున్నాను. ఆడబ్బులు ఛార్జీ కట్టుకొని అన్నయ్య కాడకి వెళ్ళిపో. అంతకంటె నేనేం చేయలేను. ఇంతే సంగతులు

నీకుమార్డు
సూర్యం.

మారమ్మకి భూమి గుండ్రంగా తిరుగుతోంది. అందులో వుత్తర, దక్షిణాలు కనపడ్డంలేదు. అవియిప్పుడు తనకి చాలా దూరంలో వున్నాయి.

ఇంక తనకు మిగిలింది తూర్పు_పడమర. బ్రతకడానికైతే పడిమరవుంది. కాని తనకా అవసరం తీరిపోయింది ఒంట్లో జవలేదు. ఇంక తనకి తూర్పు మిగిలింది. తను యిప్పుడు వుంటున్నది తూర్పునే.

పోస్టుమేన్ బెల్లు కొట్టుకొంటూ వెళ్ళిపోయాడు. ఎందుకో మారమ్మకి చిన్నప్పుడు చదూకున్న "తూర్పున బంగాళాఖాతం" అన్నది గుర్తుకి వచ్చించి.

వణుకుతున్న చేత్తోడబ్బు మొల్లో నడికట్టులో గట్టిగా కట్టుకొని ఆ మండు టెండలో మండేగుండెలతో తూర్పువైపుగా నడిచి పోతోంది మారమ్మ.